తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల
కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
09 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

# చామనపల్లి గ్రామ పునరావాసానికి భూసేకరణ ప్రక్రియ చేపడతాం

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

- భారీ వర్షాలు, వరదల సమయంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు
- మేడారం రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్‌కు 100 మీటర్ల పరిధి వరకు తరలింపు ప్రక్రియను చేపట్టే అవకాశం



**పెద్దపల్లి,అక్టోబర్ 08(జనంసాక్షి) :** చామనపల్లి గ్రామ పునరావాసానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ధర్మారం మండలం చామనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం లిభూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడులి మరియు శ్రీ శ్రీనివాస రావు గుప్త చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్ ) రామగుండం ల తో కలిసి లిజిల్లా కలెక్టర్ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి, గ్రామ పునరావాసం, భూసేకరణకు సంబంధించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా కాలినడకన పర్యటించి పలు ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల సమయంలో గ్రామం ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అనేక మంది గ్రామస్థులు తమకు వినతులు సమర్పించారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని చామనపల్లి గ్రామంలో భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మేడారం రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్‌కు సంబంధించి 100 మీటర్ల పరిధి వరకు అవసరమైన తరలింపు ప్రక్రియను తక్షణమే చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. అయితే మొత్తం గ్రామాన్ని పునరావాసం చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా అందిన ప్రజల వినతుల మేరకు చామనపల్లి గ్రామంలో భూసేకరణ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, గ్రామస్థుల నుంచి అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం తనను పంపినట్లు చెప్పారు. గ్రామంలో సుమారు 140 ఇళ్లు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని కమిషనర్ తెలిపారు. గ్రామంలోని పాఠశాల, మహిళా సమాఖ్య భవనం వంటి నిర్మాణాలను ఇప్పటికే ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం అవి ముంపునకు గురికావడం లేదని పేర్కొన్నారు. పునరావాస కాలనీని అభివృద్ధి చేసి అర్హులైన వారికి ఇంటి స్థలాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి వ్యక్తికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. ముంపు కారణంగా జీవనోపాధిని కోల్పోయే వారికి కూడా నిబంధనల మేరకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, ఇరిగేషన్ అధికారులు,సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధులకు ఉచిత నేత్ర పరీక్షలు..

## కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 8 (జనంసాక్షి)**
27వ ప్రపంచ దృష్టి దినోత్సవం?2026 సందర్భంగా కామారెడ్డి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత నేత్ర పరీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు.
వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు ఆటో రిఫ్రాక్టోమీటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిశుక్లం గుర్తింపుతో పాటు దృష్టిలోపాలను నిర్ధారించేందుకు రిఫ్రాక్షన్ పరీక్షలు చేపట్టారు. కంటిశుక్లం ఉన్నవారిని గుర్తించి, ఉచిత కంటిశుక్లం శస్త్రచికిత్సలో భాగంగా ఐఓఎల్ శస్త్రచికిత్స కోసం బోధన్‌లోని లయన్స్ ఐ హాస్పిటల్‌కు తరలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వయస్సు పెరిగే కొద్దీ కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటిశుక్లం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందితే దృష్టిని మెరుగుపరుచుకోవచ్చన్నారు. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్, జిల్లా సంక్షేమ అధికారి వెంకటేష్, వృద్ధాశ్రమ సిబ్బంది, వైద్యాధికారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత విస్తృతం చేయాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 జనంసాక్షి:** పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్ తెలిపారు. గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీస్ శాఖకు అనుసంధానం చేసి , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పోలీసింగ్‌ను మరింత వేగవంతంగా, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏ విధంగా అనుసంధానం చేయాలి , పోలీసింగ్‌లో ఏఐ ఆధారిత సాంకేతికతను ఏయే రంగాల్లో వినియోగించుకోవచ్చు అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా నేరాల విశ్లేషణ , నేరాల నివారణ , క్రైమ్ డేటా విశ్లేషణ , అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు , ట్రాఫిక్ నిర్వహణ , సీసీటీవీ ఫుటేజీ విశ్లేషణ , సైబర్ నేరాల దర్యాప్తు , సోషల్ మీడియా మానిటరింగ్ , ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా అందించడం వంటి అంశాల్లో ఏఐ సాంకేతికతను వినియోగించుకునే అవకాశాలపై సమీక్షించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బందికి అవసరమైన శిక్షణ , సాంకేతిక నైపుణ్యాల పెంపు , కళాశాలల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక నిపుణుల



సహకారంతో పోలీస్ శాఖకు ఉపయోగపడే ఏఐ ఆధారిత పరిష్కారాలు , సాఫ్ట్‌వేర్‌లు మరియు అప్లికేషన్ల అభివృద్ధి వంటి అంశాలపై కూడా చర్చించారు. విద్యాసంస్థలు , సాంకేతిక నిపుణులు మరియు పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేస్తే ప్రజా భద్రతకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు , భవిష్యత్ పోలీసింగ్‌ను సాంకేతికత ఆధారితంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్ పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో , పోలీస్ శాఖ కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నేర నియంత్రణ , దర్యాప్తు , ప్రజా భద్రత మరియు పోలీస్ సేవలలో మరింత సమర్థవంతమైన ఫలితాలు సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో నవ్య భారతి జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శిరీష్ , విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్వప్న , ఫ్యాకల్టీ సుజాత, నవ్య, లక్ష్మి , కాకతీయ కాలేజీ కిడ్స్ అధికారులు డి.వేణుగోపాల్,

మిగతా 2లో

# క్షేత్ర స్థాయిలో వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలి: కలెక్టర్

## భూముల రీ సర్వేపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులకు శిక్షణ కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 08 (జనం సాక్షి);** జిల్లాలో భూముల రీ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూభారతి కింద భూముల రీసర్వే ప్రక్రియపై జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జీపీఓలు, సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా భూ భారతి కింద భూముల రీ సర్వే ఉద్దేశం, ఉపయోగాలు, పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూముల రీ సర్వే కోసం జిల్లాలో మొత్తం 18 రోవర్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను నియమించిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వారు విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. భూముల రీ సర్వే రెవెన్యూ అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల టీంలతో చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని స్పష్టం చేశారు. రీ సర్వేలో భాగంగా ముందుగా గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని, రీ సర్వే ఉద్దేశం, ప్రయోజనాలు, మొత్తం ప్రక్రియ తదితర అంశాలపై గ్రామస్తులకు వివరించాలని సూచించారు. ఏ ఏ భూముల్లో సర్వే చేస్తారో వాటి వివరాలను ముందుగానే



చేరవేయాలని తెలిపారు. జీపీఓ, పంచాయతీ కార్యదర్శి సైతం సర్వేలో ఉండాలని వెల్లడించారు. ముందుగా గ్రామ సరిహద్దు సర్వే చేయాలని, రెవెన్యూ, నీటి పారుదల శాఖ, అటవీ శాఖ తదితర శాఖల అధికారులకు సమాచారం అందజేసి,వారు సైతం సర్వేలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో భూముల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇట్టి సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మిక గర్జనకు సిద్ధం కావాలి

## కార్మికుల హక్కుల కోసం మరోసారి ఉద్యమిద్దాం: హరీశ్‌రావు



యైటింక్లైన్ (జనంసాక్షి),అక్టోబర్ 8:
సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంస్థ భవిష్యత్తుపై చర్చించేందుకు బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో "సింగరేణి కార్మిక గర్జన" పేరుతో కీలక సమావేశం నిర్వహించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకులు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, గతంలో జాతీయ కార్మిక సంఘాల కారణంగా కోల్పోయిన అనేక హక్కులను తిరిగి సాధించామని పేర్కొన్నారు.ముఖ్యంగా డిపార్ట్‌మెంట్ ఉద్యోగాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా వేలాది మంది యువ కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిని అధిక ఉత్పత్తి, మెరుగైన పనితీరుతో లాభాల బాటలోకి తీసుకువచ్చామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

### హరీశ్‌రావు డిమాండ్లు

సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 2025?26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 36 శాతం లాభాల వాటా చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రతి నెలా మెడికల్ బోర్డులు నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని, సింగరేణికి రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు 250 గజాల ఇంటి స్థలాలు అందించాలని డిమాండ్ చేశారు.
సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న రామగుండంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆతిథ్యంతో నిర్వహించనున్న "సింగరేణి కార్మిక గర్జన" భారీ బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.
సింగరేణి కార్మికుల హక్కుల కోసం..
సింగరేణి పరిరక్షణ కోసం..
కార్మికుల భవిష్యత్తు కోసం..
సింగరేణి కార్మిక గర్జనను విజయవంతం చేద్దాం అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో రామగుండం ఆర్జీ–2 ఉపాధ్యక్షులు బలి శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య



చొప్పదండి, అక్టోబర్ 8( జనం సాక్షి):
చొప్పదండి పట్టణానికి చెందిన బోడిగె మల్లయ్య (67) అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున భవనం పై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్య గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. రాత్రి భోజనం అనంతరం సుమారు 11 గంటల సమయంలో తన గదిలో నిద్రించేందుకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున సుమారు 3.10 గంటల సమయంలో శబ్దం వినిపించడంతో కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా, మల్లయ్య భవనం కింద పడి తీవ్ర గాయాలతో మరణించాడు.మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టిబి రహిత గ్రామంగా దుబ్బ పల్లె

మంథని, అక్టోబర్ 08, (జనంసాక్షి ) :
టీబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం దుబ్బ పల్లె గ్రామాన్ని టీబి రహిత గ్రామంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్– రెవిన్యూ చేతుల మీదుగా గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి నరేష్ రావు ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఎంపీడీవో శ్రీజ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కమాన్ పూర్, అక్టోబర్ 08, (జనంసాక్షి) :
చిన్నారులకు పౌష్టికాహారం తప్పకుండా తినిపించాలని, పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ టీచర్లు గుమ్మడి శారద, లక్ష్మీ అన్నారు. కమాన్ పూర్ మండలంలోని రొంపికుంట అంగన్వాడి సెంటర్ 2,3 లలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు పిల్లలకు పోషకాహారం విశిష్టత గురించి వివరించారు. గర్భిణీ స్త్రీలు తప్పకుండా గుడ్లు, పాలు ,ఆకుకూరలు, తదితర వాటిని తప్పకుండా తీసుకోవాలి అని పేర్కొన్నారు. అలాగే చిన్నారులకు అంగన్వాడి సెంటర్లలోని పౌష్టికాహారం తప్పకుండా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు బాలింతలు ఆయా తదితరులు పాల్గొన్నారు.




## రామగిరిలో నిఘా పటిష్టం..

### సీసీ కెమెరాలకు రూ.80 వేల విరాళం

రామగిరి జనం సాక్షి :
నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో కీలకంగా మారిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను రామగిరిలో మరింత బలోపేతం చేసేందుకు ఎస్‌సీసీఎల్ ఆర్జీ– 3 ఏరియా సివిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రూ.80 వేల విరాళం అందజేసింది. ఈ మొత్తంతో పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేయని పాత సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రూ.80 వేల మొత్తాన్ని రామగిరి ఎస్‌ఐ తాడవేని శ్రీనివాస్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు, నేరాలు జరగకుండా ముందస్తు నిఘా కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే దొంగతనాలు, ప్రమాదాలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు కెమెరా ఫుటేజీ కీలక ఆధారంగా ఉపయోగపడుతుంది. నేరస్తులను గుర్తించడం, కేసుల దర్యాప్తులో ఆధారాలను సేకరించడం, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం వంటి అంశాల్లో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించనున్నాయి.

## పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత విస్తృతం చేయాలి

పి.నాగార్జున, క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్ నుండి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సి.ఓ.డి ఎం. లక్ష్మణ్ మరియు సంబంధిత అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , ప్రొఫెసర్లు , ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారు.

## జూమ్ బరా బార్' ఫ్లాష్ మాబ్‌తో మార్మోగిన ఎక్స్‌ప్లోరికా పాఠశాల

**పారమిత - ఎక్స్‌ప్లోరికా విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు**

**పారమిత విద్యాసంస్థల అధినేత ఇ. ప్రసాదరావు**

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :
స్థానిక జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా ప్రీమియం పాఠశాలలో బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా 'జూమ్ బరా బార్' పేరుతో ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం సంగీతం, నృత్యం, పండుగ ఉత్సాహంతో సందడిగా సాగింది. విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు చేశారు. బతుకమ్మ, దసరా పండుగల విశిష్టతను ప్రతిబింబించేలా సాగిన ఈ ప్రదర్శనలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. విద్యార్థుల నృత్యాలకు తల్లిదండ్రులు సైతం ఉత్సాహంగా స్పందించి వారితో కలిసి నృత్యం చేయడంతో కార్యక్రమం మరింత సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు వాటి పై ఆసక్తి, గౌరవ భావాలను పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీతం, నృత్యం, విద్యార్థులు, తల్లిదండ్రుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో 'జూమ్ బరా బార్' ఫ్లాష్ మాబ్ ఎక్స్‌ప్లోరికా ప్రీమియం స్కూల్‌లో మరపురాని పండుగ వేడుకగా నిలిచింది. ఈ సందర్భంగా పారమిత, ఎక్స్‌ప్లోరికా పాఠశాలల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రష్మిత ప్రసాద్, రాకేష్ ప్రసాద్, వి.యు.ఎమ్. ప్రసాద్, ప్రాచి, వినోద్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శర్మిష్ఠ, సమన్వయకర్త ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్



మంథని, అక్టోబర్ 08, ( జనంసాక్షి ) :
మంథని మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయ పనులను మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ , వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంపత్ రావు, డిప్యూటీ ఇంజనీర్ నరసింహ స్వామి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అసిస్టెంట్ ఇంజనీర్ మౌనిక లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతన మంథని మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, అతి త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. మంత్రి శ్రీధర్ బాబు మంథని పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చైర్మన్ తెలిపారు. నూతన మున్సిపల్ కార్యాలయంతో పాటు 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 90 అడుగుల రోడ్డు విస్తరణ వంటి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అదే విధంగా గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ల అభివృద్ధి, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఒక సంవత్సరం లోపు ప్రధాన అభివృద్ధి పనులను పూర్తి చేసి మంథనిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య, పెంటరి రాజు, నాయకులు లైశెట్టి రాజు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'ఖని'లో సీడీపీ నిధుల ద్వారా కళాభవన్ నిర్మిస్తాం..

## - రామగుండం ఎమ్మెల్యే..మేయర్

**గోదావరిఖని, జనంసాక్షి :**
గోదావరి కళా సంఘాల సమాఖ్య ప్రతినిధులు రామగుండం ఎమ్మెల్యే రాజుఠాకూర్ మక్కాన్సింగ్ ను క్యాంపు ఆఫీసులో కలిసి కళాభవన్ నిర్మాణం గురించి వినతిపత్రాన్ని అందించారు. గత 40 సంవత్సరాలుగా గోదావరి కళా సంఘాల సమాఖ్య గోదావరిఖనిలో కళాకారుల ప్రదర్శన కొరకు ఆడిటోరియం కళాభవన్‌ను నిర్మించాలని ఎంతోమంది మంత్రులకు, ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్లకు, మున్సిపల్ చైర్మన్లకు, కమిషనర్లకు, మేయర్లకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా కూడా ఎవరూ కళాకారులకు కళాభవన్ నిర్మించలేకపోయారని, గత ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు కేటాయించారు. భూమి పూజ జరిగిన తర్వాత కాంట్రాక్టర్ మరణంతో కళాభవన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం 50 కళా సమస్యలతో విరాజిల్లుతున్న గోదావరి కళా సంఘాల సమాఖ్య లోని కళాకారులు కళా సమస్యలు, కలోత్సవాలు నిర్వహించడానికి ఎలాంటి కళావేదిక లేకపోవడంతో కార్యక్రమాలను వాయిదా వేసుకుంటూ..లేదా ప్రైవేటు ఫంక్షన్ హాల్లో అధిక ఫీజులను చెల్లిస్తూ కార్యక్రమాలను నిర్వహించుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కళా సంస్థలు కను మరుగైపోతున్నాయని కళాకారులు ఎమ్మెల్యే, మేయర్‌కు ఆవేదనను వెలిబుచ్చినారు. గోదావరిఖనిని సుందర పట్టణంగా తీర్చిదిద్దుతున్న కళాకారుల చిరకాల వాంఛ కళాభవన్ నిర్మించి కళాకారులను ప్రోత్సహించాలని కళా రంగంలో నూతన కళాకారులు ఎదగాలంటే తప్పకుండా గోదావరిఖనిలో కళాభవన్ నిర్మాణ పనులు చేపట్టాలని వారు ఎమ్మెల్యేను అభ్యర్థించినారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అక్కడే ఉన్న మేయర్ మహంకాళి స్వామి గారి దృష్టికి తీసుకువెళ్లగా సిడిపి నిధుల ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలలో కళాభవన్ కూడా ఉన్నదని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలనలో ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి పాటుపడుతున్నామని త్వరలోనే గోదావరిఖనిలో అద్భుతమైన కళాభవన్ నిర్మిస్తామని వారు కళాకారులకు హామీ ఇచ్చారు.

**దసరా ఉత్సవాలలో స్థానిక కళాబృందాలకు అవకాశం ఇవ్వండి..**

ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న దసరా



ఉత్సవాలలో స్థానిక కళాబృందాలకు కూడా అవకాశం కల్పించాలని కళా సంఘాల ప్రతినిధులు కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామన్నారు. వినతీపత్రం ఇచ్చిన వారిలో గోదావరి కళా సంఘాల సమాఖ్య గౌరవ సలహాదారులు పొలసాని శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు నిట్టూరి జీవన్‌బాబు, గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు కనకం రమణయ్య, ఉపాధ్యక్షులు సోగాల వెంకటి, ప్రధాన కార్యదర్శి మాదరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి నాగుల శ్రీనివాస్, కృషి కళా సంస్థ సహాయ కార్యదర్శి బీరుక లక్ష్మణ్, ఆఫీస్ బాయ్ సలిగంటి సంపత్ ఉన్నారు.

# మహిళలు, బాలికల భద్రతలో షీ-టీమ్స్ కీలకపాత్ర పోషించాలి..

**- ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**- 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు ప్రత్యేక అవగాహన కల్పించాలి..**

గోదావరిఖని, జనంసాక్షి :
రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధ్యక్షతన గురువారం కమిషనరేట్ కార్యాలయంలో షీ-టీమ్స్, మహిళలు, పిల్లల రక్షణ, భరోసా కేంద్రాల సేవలపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలకు భద్రతపై భరోసా కల్పించడంతో పాటు పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించడంలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ, మహిళలను వేధించే ఆకతాయిలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. అందిన ఫిర్యాదులపై ఆధారాలను సేకరించి, అవసరమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు వేధింపులు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, మంచి స్పర్శ-చెడు స్పర్శ వంటి అంశాలపై పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బాధిత మహిళలు, చిన్నారులకు తక్షణ సహాయం అందించడంతో పాటు కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస, సంక్షేమ సేవలు అందేలా సంబంధిత శాఖలు



సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల పట్ల సానుభూతి, మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ వారికి ధైర్యం, భరోసా కల్పించాలన్నారు. బాధితుల ఫిర్యాదులపై కేసుల నమోదు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని, ఫిర్యాదులో నేరం ఉన్నట్లు తేలితే ముందుగా కేసు నమోదు చేసి అనంతరం దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. బాధితుల పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, బాధితులకు నాణ్యమైన కౌన్సెలింగ్, రక్షణ, పునరావాస సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. షీ టీమ్స్ సిబ్బంది నిజాయితీ, పారదర్శకత, నిష్పక్షపాతంగా వృత్తిపరమైన విధులు నిర్వహిస్తూ బాధితుల గోప్యతను కాపాడాలని కమిషనర్ సూచించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను ఆశ్రయించేలా అవగాహన కల్పించాలని, వారి భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ అనిల్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, షీ టీమ్ ఎస్ఐలు హైమా, ఉషారాణి, లావణ్య, షీ టీమ్ సిబ్బంది, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

# తైక్వాండోతో ఆత్మ రక్షణ - విద్యార్థులకు బెల్టుల ప్రదానం

**కోనరావుపేట(జనంసాక్షి):**
తైక్వాండో నేర్చుకోవడంతో ఆత్మరక్షణ పెంపొందించుకోవచ్చన సర్పంచ్ కుంటెల్లి నాగరాజు అన్నారు. గురువారం కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని రుషి వాణి విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో సన్రైస్ తైక్వాండో అకాడమి ఆధ్వర్యంలో విద్యార్థులకు కలర్ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ.. ఆపద సమయములో శత్రువుల బారి నుండి రక్షించుకునేందుకు తైక్వాండో దోహదపడుతుందని అన్నారు. దీనితోపాటుగా క్రమశిక్షణ, మనోధైర్యం, శారీరకదారుఢ్యం పెరుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలంటే కేవలం తైక్వాండోతోనే సాధ్యమన్నారు. బాలికలు నేర్చుకునేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. విద్యతోపాటు ఆటలపై కూడా ఆసక్తి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆకట్టుకోగా, 30 మందికి బెల్టులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్రవెల్లి దాసు,



తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి సంతోష్, సన్రైస్ తైక్వాండో అకాడమి మాస్టర్ ఎం. శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకుడు కాశవేణి మహేష్, సింగిల్ విండో డైరెక్టర్ ఉప్పుల గంగయ్య, వార్డు సభ్యులు బుర్ర రమేష్, ఎర్రవెల్లి విజయ్, నాయకులు వంగల భూమేష్ గౌడ్, టైక్వాండో మాస్టర్ రాచకొండ విజయ సింహాచారి, లోలపు దేవరాజు, సుంకరి శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎంఓసీపీలో 'ఫైనల్ మైన్ క్లోజర్' పనులు పరిశీలించిన ప్రొఫెసర్ గంగోపాధ్యాయ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆర్‌జీ-1 పరిధి మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో చేపడుతున్న గని మూసివేత, భూపునరుద్ధరణ పనులను ప్రముఖ విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐటీ) శిబ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ గంగోపాధ్యాయ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం గని మూసివేత పనులను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తనిఖీ చేయించడం తప్పనిసరి. ఇందులో భాగంగానే ప్రొఫెసర్ గంగోపాధ్యాయ నేతృత్వంలోని బృందం ఈ తనిఖీలు చేపట్టింది. సుమారు 30 సంవత్సరాల పాటు దేశ ఇంధన అవసరాలకు నిరంతరాయంగా బొగ్గును అందించిన మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ గనిలో బొగ్గు నిల్వలు పూర్తిగా తరిగిపోవడంతో 2022 సంవత్సరంలో ఉత్పత్తి కార్యకలాపాలను సింగరేణి యాజమాన్యం నిలిపివేసింది. అనంతరం డీజీఎంఎస్, పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని తిరిగి యథాతథ స్థితికి తీసుకురావడానికి సింగరేణి భారీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గనిలోని ఖాళీ ప్రదేశాన్ని (ఓవర్‌బర్డెన్) మట్టితో పూడ్చడం ఉపరితలాన్ని వ్యవసాయానికి అనుకూలంగా చదును చేయడం, నీటి నిల్వ, నేల కోతను నివారించే చర్యలను, పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ప్రొఫెసర్ గంగోపాధ్యాయ మొదట మేడిపల్లి ప్రాంతంలో చేపట్టిన బ్యాక్ ఫిల్లింగ్ పనుల నాణ్యతను, నేల స్థిరత్వాన్ని, నాటిన మొక్కల పెరుగుదలను పరిశీలించారు. గనిని తిరిగి సాధారణ భూమిగా, అటవీ ప్రాంతంగా మార్చే ప్రక్రియ పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు.

అనంతరం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ లకిడి రమేష్ మేడిపల్లి మైన్ క్లోజర్ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటివరకు చేసిన ఖర్చు, భవిష్యత్ నిర్వహణ ప్రణాళికలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ డి. లలిత్‌కుమార్, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ విభాగం జీఎం సుజాయ్ ముజెందార్, యస్ఓ టు జియం కె. చంద్రశేఖర్, డిజియం (ఫారెస్ట్) కర్ణ, కార్పొరేట్ పర్యావరణ విభాగం, ప్రాజెక్ట్ ప్లానింగ్ విభాగం నుండి అడిషనల్ మేనేజర్లు తిరుపతి, శంకర్, రవీంద్రనాథ్, ఆర్జీ ఏరియా సర్వే ఆఫీసర్ లక్ష్మిరాజం, పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

## 14న గోదావరిఖనిలో భారీ బహిరంగ సభ

**గోదావరిఖని, జనంసాక్షి :**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 14వ తేదీన గోదావరిఖనికి రానున్నట్టు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి తెలిపారు. గోదావరిఖనిలోని జీఎం కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి కేటీఆర్ హాజరుకానున్నట్టు ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.



# ఆ గ్రామానికి కీడు సోకిందటా

**- ఆ ఊరంతా ఖాళీ నాలుగు దిక్కులకు ప్రయాణం**

**- కంప్యూటర్ యుగంలో మూఢ నమ్మకాలపై ఆసక్తి**

**సుల్తానాబాద్,అక్టోబర్ 08(జనంసాక్షి) :**
కంప్యూటర్ యుగంలో మూఢనమ్మకాలపై ఆసక్తి పెరిగి ఆ గ్రామం మొత్తం ఖాళీ చేసి వేరే ఇతర గ్రామాలకు వెళ్లి సేద తీర్చిన సంఘటన సుల్తానాబాద్ మండలంలో చోటు చేసుకుంది. గ్రామంలో అరిష్టం మొదలైంది అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా కుటుంబంలోని మహిళలు వృద్ధులు అందరు ఏకంగా ముల్లె మూట సదురుకొని నాలుగు దిక్కుల గ్రామాలు ఇతర గుట్టల ప్రాంతాలకు వెళ్లి టెంటులు వేసుకొని మరి సేద తీర్చుడం చూస్తుంటే సభ్య సమాజం సిగ్గుపడుతుంది. కంప్యూటర్ యుగంలోనూ ఇలాంటి మూఢ నమ్మకాల ను నమ్మి గ్రామం మొత్తం ఖాళీ అవడం చూస్తుంటే, రోజురోజుకు మూఢనమ్మకాలపై ప్రజల ప్రభావం ఎలా ఉందో అర్థం అవుతుంది. ఆ గ్రామం ఎటు చూసినా నిర్మానుష్యంగా, కనిపించడంతోపాటు అన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉన్నటువంటి పరిస్థితి దాపురించింది. ఎవరికి ఫోన్ చేసినా ఫోన్లన్నీ స్విచ్ ఆఫ్. ఇది సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో వెలుగు చూసిన సంఘటన. సమాచారం తెలియడంతో ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బంది ఆ గ్రామాన్ని చుట్టుముట్టి గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టారు. రోజురోజుకు టెక్నాలజీ పెరుగుతున్నా, గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మూఢనమ్మకాలను విశ్వసిస్తూ,ఇంకా గ్రామీణ ప్రాంత ప్రజలు పేదరికంలో మగ్గుతూ, అప్పులు చేస్తూ దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. గ్రామంలో అన్ని కులాలు అన్ని మతాలకు చెందిన పెద్దలు ప్రజాప్రతినిధులు ఎంతోమంది ఉన్నా కానీ, మూఢ నమ్మకాలను విశ్వసించడం చూస్తుంటే, రానున్న రోజులలో మూఢనమ్మకాల ప్రభావం ఇతర గ్రామాలపై పడి, ఇదే తంతు కొనసాగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మూఢనమ్మకాలను పారదోలి,ప్రజలంతా చైతన్యం కావలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు మేధావులు,స్వచ్ఛంద సేవ సంస్థ నాయకులు సూచిస్తున్నారు.





# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మారథాన్ కార్యక్రమం..

గోదావరిఖని, జనంసాక్షి :
తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశానుసారం మాస్ కాంపెయిన్‌లో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసిటిసి కౌన్సిలర్ కట్కూరి శంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త సహకారంతో ఎయిడ్స్ మీద అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు మొదటి బహుమతి కింద జి.భరత్‌కు రూ.వేయి, రెండవ బహుమతి కింద ఏ.ఈశ్వర్‌కు రూ.500నగదు బహుమతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలుగా గెలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓర్ఝా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, డాక్టర్ జి.సుబ్బారావు, డాక్టర్ నరేష్,డాక్టర్ అజయ్‌కుమార్,డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సతీష్,అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




# కనీస వేతనాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

**- సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా కింద రూ.25 వేలు చెల్లించాలి..**

**- ఆర్జీ-1 సీహెచ్‌పీ కార్మికుల సమావేశంలో ఎంఎ గౌస్..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికి లాభాల్లో వాటా కింద 25 వేల రూపాయలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ.వన్ అధ్యక్షులు ఎంఎ గౌస్ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. గురువారం సింగరేణి ఆర్జీ.వన్ ఏరియాలోని జిడికె వన్ సిహెచ్‌పిలో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో గత 20 సంవత్సరాల నుండి దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో పని చేస్తూ బొగ్గు ఉత్పత్తి కి సహకరిస్తూ సంస్థ లాభాల్లో వీరి కృషి ఉందని ఆయన తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా సింగరేణి లో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటియుసి 2024లో సంస్థ లాభాల నుంచి 5000/- రూపాయలు, 2025 లో 5500/- రూపాయలు కాంట్రాక్టు కార్మికుల కు ఇప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. సింగరేణి కి 2025-2026 సంవత్సరం లో ఎంతో కొంత లాభాలు వచ్చే అవకాశం ఉందని, అట్టి లాభాల్లో నుంచి కాంట్రాక్టు కార్మికుల కు 25 వేల రూపాయలు వాటా కింద ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన యాజమాన్యం ను కోరారు. సింగరేణి లో కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని జీతంతో తమ కుటుంబాలను పోషించు కోవడంలో అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు కావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరచడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కనీస వేతన సవరణ చైర్మన్‌గా ఉన్న జనక్‌ప్రసాద్ ఉండి కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల అమలు,వారి సంక్షేమం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు. అతి తక్కువ వేతనాలతో సింగరేణి లో కాంట్రాక్టు కార్మికులు శాశ్వత కార్మికుల స్థానంలో పని చేస్తున్నప్పటికీని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సి ఉండగా కనీస వేతనాల సవరణ చైర్మన్‌గా ఉన్న జనక్‌ప్రసాద్ వీరి కష్టాలు కనపడడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం, కనీస వేతనాల సవరణ చైర్మన్ గారు స్పందించి సింగరేణి లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు,సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు పనిస్థలాల్లో సేఫ్టీ మెటీరియల్ ఇవ్వక పోవడం వల్ల వారు ప్రమాదాలకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. కనుక యాజమాన్యం వెంటనే కాంట్రాక్టు కార్మికుల కు సేఫ్టీ మెటీరియల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు వెంకన్న, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రకృతి వ్యవసాయ రైతులకు ఉచిత ధ్రువీకరణ

## - ఏఈవో రవితేజ

సుల్తానాబాద్,అక్టోబర్ 08(జనంసాక్షి) :
జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా ప్రకృతి పద్ధతుల్లో సాగు చేస్తున్న 125 మంది రైతులకు ఉచితంగా సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయనున్నట్లు ఏఈవో రవితేజ తెలిపారు. ఈ మేరకు మియాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాగు ధ్రువీకరణ కోసం రైతులు దరఖాస్తు చేసుకునే విధానం,అవసరమైన వివరాలు,ధ్రువీకరణ ప్రక్రియపై అసిస్టెంట్ డైరెక్టర్,సీడ్ సర్టిఫికేషన్ కీర్తన అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాగు ధ్రువీకరణ పత్రం పొందడం ద్వారా రైతులు తమ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించుకునేందుకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఏఈవో రవితేజ తెలిపారు. సాధారణంగా సాగు ధ్రువీకరణ కోసం రైతులు రుసుము చెల్లించాల్సి ఉంటుందని, అయితే జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా అర్హులైన రైతులకు ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల పోచం,అసిస్టెంట్ డైరెక్టర్,సీడ్ సర్టిఫికేషన్ కీర్తన,ఏఈవో రవితేజ,సర్టిఫికేషన్ వాలంటీర్ సుమశ్రీ,కృషి సఖులు మంజుల,స్వప్న,రైతులు పాల్గొన్నారు.

## మనవడి పుట్టిన రోజు

**- నిన్ను తన రీతిలో వేడుకలు!!!**

**- వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ**

**సుల్తానాబాద్,అక్టోబర్ 08(జనంసాక్షి) :**
హంగులు ఆర్భాటాలకు పోకుండా పుట్టినరోజు కొంతమంది పేదలకైన సహాయం అందించాలన్న గొప్ప లక్ష్యంతో సుల్తానాబాద్ కు చెందిన ప్రముఖ రైస్ మిల్ వ్యాపారవేత్త ,సామాజిక సేవకులు సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి సత్తెమ్మ దంపతుల మనవడు శ్రీశాంక్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని మార్కండేయ కాలనీలో గల ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఉన్న పేదవారికి దుస్తులు అందజేశారు, ముందుగానే అందులో ఉంటున్న వృద్ధుల కు పాయింట్ షర్టు కుట్టించేందు కు కొలతలు తీసుకొని అందించడం చాలా గొప్పతనం వృద్ధాశ్రమంలో పురుషులు, మహిళలు శ్రీశాంక్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి,రామ్మూర్తి సత్తమ్మ దంపతుల తో పాటు వారి కుమారుడు కోడలు రాజేష్ ప్రియాంక దంపతుల కు,వీరి కుమారులు శ్రీశాంక్,శ్రేయాంక్ లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా కొమురవెల్లి రామ్మూర్తి సత్తమ్మ దంపతులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు ఆర్భాటంగా నిర్వహించుకోవడం కంటే అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్ లక్ష్మి,వృద్ధాశ్రమం కో..ఆర్డినేటర్ గట్టు స్వామి,నరేష్,క్యాడర్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్,కొమురవెల్లి రామ్మూర్తిని,రాజేష్ లను అభినందించారు.



## పోషకాహారంపై అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బంది

**సుల్తానాబాద్,అక్టోబర్ 08(జనంసాక్షి) :**
మండలంలోని మంచిరామి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలు, సమతుల ఆహారం,గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి,సర్పంచ్ ఉప్పు లక్ష్మి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.స్వాతి,పంచాయతీ కార్యదర్శి కె.రాజేష్ కుమార్,అంగన్వాడీ టీచర్లు,గర్భిణులు,చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేయాలి

## అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,అక్టోబర్ 08(జనంసాక్షి) :
టీబీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేస్తూ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు అదనపు కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీబీ వ్యాధి నియంత్రణ, అనుమానిత కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.టీబీ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స టీబీ నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు సకాలంలో అందేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు. రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.



80 గ్రామాలను టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక చేయడం అభినందనీయం.టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 80 గ్రామాలు టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక కావడం అభినందనీయమని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ గ్రామాల్లో చేపట్టిన చర్యలను స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగిలిన గ్రామాలను కూడా టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో టీబీ అనుమానితులను గుర్తించి పరీక్షలకు పంపించాలని తెలిపారు. టీబీపై ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి కుటుంబ సభ్యులు, సమాజం నుంచి సహకారం అందేలా అవగాహన కల్పించాలని సూచించారు.

– టీబీ నిర్మూలనపై విస్తృత అవగాహన : టీబీ వ్యాధి నివారణ, లక్షణాలు, చికిత్స, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన గ్రామాల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా కొత్త కేసులను ముందుగానే గుర్తించడం, చికిత్స అందించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం వంటి చర్యలను నిరంతరం కొనసాగించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వై. పవిత్ర, జిల్లా టీబీ నియంత్రణ విభాగం అధికారి కె. వి.సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రాజగోపాల్ , వైద్య సిబ్బంది, వివిధ మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, టీబీ రహిత గ్రామాల సర్పంచులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో ప్రి ప్రైమరీ విద్యార్థులకు ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



పెద్దపల్లి,అక్టోబర్ 08(జనంసాక్షి) :
జిల్లా కేంద్రంలోని గాయత్రి విద్యానికేతన్, లో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రి ప్రైమరీ విద్యార్థులకు ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు అందంగా ముస్తాబై, రంగురంగుల బతుకమ్మలను తీసుకువచ్చి ఆటపాటలతో సందడి చేశారు. దీంతో గాయత్రి విద్యానికేతన్ ప్రాంగణం బతుకమ్మ పూల సోయగాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, దాని వెనుక ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పరమైన ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.ప్రతి పూజలోనూ పూలను ఉపయోగిస్తాం, కానీ పూలనే పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ అని తెలియజేశారు. ప్రకృతికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ఉన్న అనుబంధాన్ని, ప్రకృతిని గౌరవించడం ద్వారా కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు.బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరీదేవిని పూజిస్తూ ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం మన సంప్రదాయమని తెలిపారు. బతుకమ్మ ఆటపాటల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకున్నారు.విద్యార్థుల బతుకమ్మ ఆట, పాటలు,సంప్రదాయ దుస్తులు,రంగురంగుల బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించేలా ఎంతో ఆహ్లాదకరంగా సాగింది.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ మేడం,ప్రైమరీ టీచర్స్ బృందం పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.

## టిబి ముక్త గ్రామ పంచాయతీగా నీరుకుల్ల. ఇది సమిష్టి విజయం సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్



సుల్తానాబాద్, అక్టోబర్ 08(జనంసాక్షి) :
మండలంలోని నీరుకుల్ల గ్రామ పంచాయతీకి టీబీ ముక్త గ్రామంగా గుర్తింపు రావడం పట్ల సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇది నీరుకుల్ల గ్రామ ప్రజలందరికీ సమిష్టి విజయమని తెలిపారు. గ్రామపంచాయతీ పాలకవర్గంతోపాటు సిబ్బంది కృషి ఉందన్నారు. సంబంధిత జిల్లా అధికారుల ద్వారా ఎంపీడీవో దివ్యదర్శనరావు, సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్ గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు.రానున్న రోజులలో అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నీరుకుల్ల గ్రామం పయనిస్తుందని తెలిపారు.

## ప్రీమియర్ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

సుల్తానాబాద్,అక్టోబర్ 08(జనంసాక్షి) :
మున్సిపల్ పరిధిలోని,6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ ఎస్ పి ఎల్,సీజన్-2 కార్యక్రమం అక్టోబర్ 10,న నిర్వహించనున్న సందర్భంగా ప్రారంభోత్సవం సందర్భంగా,సుల్తానాబాద్ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే మ్యాచ్ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ టి రమేష్ కు ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎల్,ఆర్గనైజర్లు సందీప్, రాహుల్,హేమన్ రాజ్ పాల్గొన్నారు.



# తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## - అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,అక్టోబర్ 08(జనంసాక్షి) :
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్-2026లో నిర్వహించనున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో భద్రత, ప్రశ్నపత్రాల భద్రత, విద్యుత్ సరఫరా,వైద్య సేవలు,పారిశుద్ధ్యం, తాగునీరు, పరీక్షా సిబ్బంది, జవాబు పత్రాల తరలింపు తదితర అంశాలపై సమీక్షించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

– పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన భద్రత :
పెద్దపల్లి పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షల సమయంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది, హోంగార్డులను బందోబస్తు విధుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.– పరీక్షల నిర్వహణ సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సీఆర్‌పీసీ అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణకు అవసరమైన సిట్టింగ్ స్క్వాడ్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.– ప్రశ్నపత్రాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ : పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను నిర్ణీత విధానంలో భద్రపరిచేందుకు పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉంచి, పరీక్షల షెడ్యూల్ ప్రకారం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల ద్వారా పరీక్షా కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పరీక్షలు పూర్తయిన అనంతరం జవాబు పత్రాలను సీల్ చేసిన బండిళ్ల రూపంలో ప్రతిరోజు సురక్షితంగా పోస్టల్ శాఖకు అప్పగించి, నిర్ణీత విధానంలో పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, వైద్య సేవలు అందుబాటులో ఉండాలి పరీక్షా సమయాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.
పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ప్రథమ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు.పారిశుద్ధ్యం, తాగునీటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షలకు ముందు పరీక్షా గదుల్లో క్రిమిసంహారక ద్రావణాన్ని స్ప్రే చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ప్రతి పరీక్షకు ముందు పరీక్షా కేంద్రాల లోపల, బయట పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

– పరీక్షా సిబ్బందికి సహకారం అందించాలి : పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమన్వయం చేసుకుని సిబ్బందిని సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి పట్టణంలోని జెడ్‌పీహెచ్‌ఎస్ బాలికల, జెడ్‌పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలల్లో తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు అక్టోబర్ 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అక్టోబర్ 11న వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనుండగా, అక్టోబర్ 12 నుంచి 17వ తేదీ వరకు ప్రధాన పరీక్షలు కొనసాగనున్నాయి.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన , జిల్లా 10వ తరగతి ఎగ్జామినేషన్ అధికారి రాంరెడ్డి, విద్యాశాఖ అధికారులు, పోలీస్, వైద్య, మున్సిపల్, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

**○విచారణలో తేల్చిన ఎంపీడీవో రామ్మోహన్ చారి**
**○తప్పు జరిగితే ఉపేక్షించేది లేదు**
**○విచారణ నివేదికను సీఎంఓ కార్యాలయానికి పంపిస్తాం..**

**చిగురుమామిడి అక్టోబర్ 08(జనంసాక్షి):**
మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి అందిన ఫిర్యాదుపై అధికారులు గురువారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ముదిమాణిక్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోయిని రమేష్ సమక్షంలో చిగురుమామిడి ఎంపీడీవో రామ్మోహన్ చారి, మండల ఎంపీఓ కిరణ్, ఏపీఓ రాజు, టీఏ శ్రీనివాస్ లతో కూడిన అధికారుల బృందం ఈ విచారణ నిర్వహించింది. గ్రామానికి చెందిన గారబోయిన బాలమల్లు ఫీల్డ్ అసిస్టెంట్ పచ్చిమట్ల మధుసూదన్ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని సీఎంఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్‌ను పిలిపించి అధికారులు విచారించారు. అనంతరం ఎంపీడీఓ రామ్మోహన్ చారి మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపామని, అయితే ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లభించలేదన్నారు. విచారణ స్థలంలో ఉన్న ఉపాధి కూలీలను కూడా సమస్యలపై అడగ్గా, ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవమని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేలిందని, ఈ విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను సీఎంఓ కార్యాలయానికి పంపిస్తామని ఎంపీడీఓ తెలిపారు. విధుల్లో ఎలాంటి తప్పులు జరిగినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్ విచారణ అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామంలో 16సామాజిక తనిఖీలు జరుగుతుంటాయని, ఇప్పటివరకు తనపై ఎలాంటి ఆరోపణలు రాలేదని చెప్పారు. ఒకవేళ తన వల్ల ఏదైనా తప్పు జరిగినట్లు నిరూపితమైతే శాఖాపరమైన చర్యలను స్వచ్ఛందంగా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ విచారణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# విద్యుత్ నియంత్రిక ఏర్పాటు..

**గాంధారి జనంసాక్షి :**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని మాతు సంఘం గ్రామంలో లోవోల్టేజ్ విద్యుత్ సమస్య ఉందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు కి విన్నవించడంతో వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు ఆదేశించడం జరిగింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాతు సంఘం గ్రామంలో నూతనంగా 25 నెలజీ ఆఖీ అమర్చారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ వందన- బల్వంత్ రావు ఉపసర్పంచ్ బుచ్చి స్వామి గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాధోజి శంకర్రావు మాజీ పిఏసిఎస్ చైర్మన్ ముకుందరావు మాజీ సర్పంచ్లు సంగారావు భాస్కర్ కాసిం మరియు గ్రామస్తులు విద్యుత్ అధికారులుంఆఇ చికోటి మల్లేష్ ంవ మానిగాళ్ల నాగరాజు లైనమన్ దూది తిరుపతి రెడ్డి సంతోష్ పాల్గొన్నారు. సమస్య తెలిపిన వెంటనే స్పందించిన స్థానిక ఎమ్మెల్యే కి మాతుసంగం గ్రామ సర్పంచ్ వందన బల్వంత్ రావు గ్రామస్తుల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.




## ఓట్ల చోరీకి పాల్పడిన సీఈసీ చీఫ్‌ను భర్తరఫ్ చేయాలి

**సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతల డిమాండ్..**

**ఆందోళనలో పలువురు నాయకుల అరెస్ట్**

**సిరికొండ , అక్టోబర్ 8(జనం సాక్షి ):**
ఓట్ల చోరీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ సీఈసీ చీఫ్ జ్ఞానేశ్వర్‌ను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో లక్షలాది మంది భారతీయుల ఓట్లను రద్దు చేసిన సీఈసీ చీఫ్ జ్ఞానేశ్వర్ ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడని ఆరోపించారు. బీజేపీ చేతిలో కీలుబ ొమ్మగా మారి ఓట్లు, ఈవీఎంల ట్యాంపరింగ్‌కు పాల్పడుతూ ఆ పార్టీ గెలుపు కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసే విధంగా ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సీఈసీ చీఫ్ జ్ఞానేశ్వర్‌ను పదవి నుంచి భర్తరఫ్ చేయడంతో పాటు అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పాల్గొన్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులతో పాటు జిల్లా నాయకులు బి. దేవారం, ఏఐయూకేఎస్ డివిజన్ అధ్యక్షులు బి. కిషన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం. నరేందర్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# యువత తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

**డ్రగ్స్ చెడు అలవాట్లకు బానిస కావద్దంటున్న ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్**

అక్టోబర్ 8 జనం సాక్షి గాంధారి:
యువత తమ విలువైన జీవితాన్ని డ్రగ్స్, గాంజా మత్తు పదార్థాలకు బానిస కాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువకులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ అన్నారు. వివరాల్లోకి వెళితే కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని ముధెల్లి గ్రామంలోసైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు లోనై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని తెలిపారు. చెడు అలవాట్లకు బానిసలై కొంతమంది యువత నేరాల వైపు మళ్లుతున్నారని, చివరకు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.



**రోడ్డు భద్రతపై సూచనలు**

మైనర్లు బైకులు నడపకూడదని, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ప్రతి వాహనానికి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు సక్రమంగా ఉండాలని తెలిపారు. రహదారులపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు.

**సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ**

గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో జరిగే నేరాలను గుర్తించడం, అరికట్టడం సులభమవుతుందని తెలిపారు. యువతే దేశానికి భవిష్యత్తు అని అన్నారు. దేశభక్తి, గ్రామాభివృద్ధి, ఉన్నత విద్య, ఉన్నత ఉద్యోగాల వైపు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ వీరయ్య చౌదరి, గాంధారి ఎస్సై మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమల్లారెడ్డిలో ఫార్మ్ పాండ్ పనుల పరిశీలన

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి: అధికారులు**



**కామారెడ్డి, అక్టోబర్ 8 (జనంసాక్షి):**
కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో సీఎం ప్రజావాణి దరఖాస్తుల విచారణలో భాగంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ, టీఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను కించపరిచేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దుర్మార్గం: బీఆర్ఎస్ నేతలు

**కిషన్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన - మూడో పట్టణ సీఐకి ఫిర్యాదు**

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 8 ( జనంసాక్షి ) :**
కరీంనగర్ పరిధిలోని కిసాన్ నగర్ బిఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను కించపరిచేలా కొందరు అసాంఘిక శక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్కారహీనమైన రాజకీయాలకు పాల్పడుతూ, కావాలని కించపరిచేలా ప్రవర్తిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు చల్లా హరిశంకర్ డిమాండ్ చేశారు. ఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కిసాన్ నగర్ నిరసన తెలిపిన అనంతరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట కొద్దిసేపు బైఠాయించారు. ఈ సందర్భంగా చల్లా హరిశంకర్ మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న గంగుల కమలాకర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఇటువంటి చౌకబారు చర్యలతో గంగుల గారి ప్రజాదరణను తగ్గించలేరని స్పష్టం చేశారు. అనంతరం చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మూడో పట్టణ సీఐని కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిని, వారి వెనుక ఉన్న సూత్రధారులను సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా తక్షణమే గుర్తించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.





## పారమిత వరల్డ్ స్కూల్ లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :**
స్థానిక అల్గునూర్ లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి, వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు సందడి చేశారు. సంప్రదాయ ఆటలు, పాటలు, నృత్యాలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఉత్సాహభరితమైన పాల్గొనడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి.యు.ఎం. ప్రసాద్ మాట్లాడుతూ, "బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి – సంప్రదాయాల వైభవానికి ప్రతీక. మన ప్రాంతీయ సంస్కృతిని, పండుగల విశిష్టతను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం ద్వారా కుటుంబ విలువలు, సామాజిక అనుబంధం మరింత బలపడతాయని అన్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంప్రదాయాలను కాపాడుతూ వాటిని భావితరాలకు అందించడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, వి.యు.ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**వేడుకలను ప్రారంభించిన మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి**

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగ బతుకమ్మ వేడుకలు కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం వైభవంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, విద్యార్థినుల సంప్రదాయ వస్త్రధారణ, తెలంగాణ జానపద గీతాలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులకు మన పండుగలు, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే మానేరు విద్యాసంస్థల లక్ష్యమని తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ చుట్టూ తిరుగుతూ సందడి చేశారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పూలవనంలా కనువిందు చేసింది. తెలంగాణ జానపద గీతాలు, బతుకమ్మ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. వేడుకల్లో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కరీంనగర్‌లో బిజేపి భారీ బైక్ ర్యాలీ

### 'కిసాన్ నగర్ బండి సంజయ్ అడ్డా'

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 8 ( జనంసాక్షి ) :**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వానికి మద్దతుగా కరీంనగర్ జిల్లా బిజేపి అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో కిసాన్ నగర్ గాంధీ విగ్రహం నుండి చింతల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.
?ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, "కిసాన్ నగర్ అంటేనే బండి సంజయ్ అడ్డా" అని, ఎంతమంది కుట్రలు చేసినా బిజేపిపై ప్రజల ఆదరణ తగ్గదని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. కేంద్రం అందించిన అమృత్, స్మార్ట్ సిటీ, అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ వల్లే కిసాన్ నగర్‌తో పాటు కరీంనగర్ సమగ్ర అభివృద్ధి చెందిందన్నారు. మూడేళ్లుగా నియోజకవర్గాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కేంద్ర నిధులతో జరిగిన అభివృద్ధిని తన ఖాతాలో వేసుకుంటూ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో బిజేపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ గారి 25 ఏళ్ల ప్రజాసేవకు స్ఫూర్తిగా అంగన్‌వాడీ సిబ్బందికి ఘన సత్కారం



**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 8 ( జనంసాక్షి ) :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, 53వ డివిజన్‌లో అంగన్‌వాడీ సిబ్బందిని కార్పొరేటర్ కొంపెల్లి శ్వేత రమణ్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా 53వ డివిజన్ కార్పొరేటర్ కొంపెల్లి శ్వేత రమణ్ మాట్లాడుతూ, సమాజంలో మహిళా శిశు సంక్షేమం కోసం అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై, అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ దేశానికి సేవా స్ఫూర్తిని అందిస్తోందని, అదే స్ఫూర్తితో సమాజానికి అంకితభావంతో సేవలందిస్తున్న ప్రతి సేవామూర్తిని గౌరవించాలనే ఉద్దేశంతో ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**- అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు**

**- మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి**

**రామగిరి జనం సాక్షి :**
బాలికలు తమ హక్కులు, రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం (అక్టోబర్ 11) సందర్భంగా మంథని న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో రామగిరి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు అందుబాటులో ఉన్న న్యాయ పరిరక్షణ, ఉచిత న్యాయ సేవలు, తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి పీ. మంజుల, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, రామగిరి ఎస్ఐ తాడవేని శ్రీనివాస్ న్యాయవాదులు శశిబూషణ్ కాచే,మంథని శ్రీనివాస్, ఎండీ.షబానా, అశోక్ రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు







## మంథని రేంజ్ అధికారిగా సామినేని శ్రీనివాసరావు

**మంథని, అక్టోబర్ 08, (జనంసాక్షి) :**
మంథని ఫారెస్ట్ రేంజ్ నూతన రేంజ్ ఆఫీసర్ గా సామినేని శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రేంజ్ పరిధిలోని సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. అనంతరం రేంజ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రేంజ్ పరిధిలోని అటవీ సంరక్షణ, సిబ్బంది సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ దేవదాసు, సెక్షన్ ఆఫీసర్లు మంగిలాల్, రవి, నహిదా పర్వీన్, బీట్ ఆఫీసర్లు రాంసింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్,ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులకు నిరసనగా చిగురుమామిడిలో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా..



**చిగురుమామిడి అక్టోబర్ 08(జనంసాక్షి):**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో మహా ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ,అమిత్ షాలకు వ్యతిరేకంగా నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అందే సురేష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యయుతంగా ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.బీజేపీ అధికారంలోకి రావడానికి ముఖ్య పాత్ర వహిస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనను జైల్లో వేయాలని డిమాండ్ చేశారు.
వీరితో పాటు సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లరెడ్డి, మర్రి శ్రీనివాస్,బొమ్మగాని పరశురాములు, చాడ మహిపాల్ రెడ్డి,జిల్లెల్ల భగవాన్ ప్రసాద్,కవ్వంపెల్లి సంజీవ్, బొమ్మగని వెంకటేశ్వర్లు, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే గ్రామ అధ్యక్షులు ఎనగందుల లక్ష్మన్, పీచు మల్లారెడ్డి,ముఖ్య నాయకులు దోమ నరసింహారెడ్డి, దోమ తిరుపతి రెడ్డి, సిరవేని సంపత్,గుడిసె మల్లికార్జున్, చింతం సుధాకర్, ముద్రవెని కుమార్, బెజ్జంకి జాక్స్ కుమార్,నిలిగొండ కోటి, వార్డు సభ్యుడు కోతర్ల శివంజనేయులు,పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**ఎడపల్లి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :**
నడిపల్లి మండల కేంద్రంలో గురువారం రోడ్డు ప్రమాదంలో బోధన్ పట్టణం రాకాసిపేట్ కు చెందిన కళావతి మరణించినట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముదు నేషనల్ హైవే 63 ను దాటుతుండగా ఏషాలా కళావతి అనే మహిళను నిజామాబాదు నుండి బోధన్ వైపు ద్వి చక్ర వాహనం మీద వెళ్తున్న ఎడపల్లి మండల కేంద్రంకు చెందిన గోవింద్ సింగ్ ద్విచక్ర వాహనంతో బలంగా ఢీ కొట్టారు. వెంటనే బాధితురాలిని అంబులెన్సులో నిజామాబాదు గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించగా తలకు బలమైన గాయం కావడంతో ఆమె మరణించినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు ఆమె కుమారుడు రాజు ఇచ్చిన దరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎడపల్లి ఎస్సై రమ వివరించారు.



## మందర్న పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

**బోధన్, అక్టోబర్ 8 ( జనంసాక్షి ) :**

మందర్న గ్రామ ప్రభుత్వ పాఠశాలను గురువారం సాలూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి నరసయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పాఠశాల విద్యా ప్రమాణాలతో పాటు, మధ్యాహ్న భోజన నాణ్యతను మరియు ప్రస్తుతం జరుగుతున్న పాఠశాల పరీక్షల నిర్వహణను అధికారులు, గ్రామ ప్రముఖులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఎంపీడీవోతో పాటు గ్రామ పంచాయతీ అధికారిణి శిల్ప, ఉపసర్పంచ్ ప్రహ్లాద్, బీజేపీ మండల అధ్యక్షులు రావుబ గంగాధర్, గ్రామ సామాజిక కార్యకర్త నవనాథ్, సోషల్ మీడియా ప్రతినిధి గొనె రేవంత్ పాల్గొన్నారు.

## నాగంపేటలో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**గంభీరావుపేట, అక్టోబర్ 08, జనంసాక్షి:** గంభీరావుపేట విద్యుత్ విభాగ పరిధిలోని నాగంపేట గ్రామంలో వ్యవసాయ అవసరాల కోసం అదనంగా 100 కేవీఏ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరగనుంది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సరఫరాకు అనుసంధానం చేశారు. దీంతో నాగంపేట గ్రామంలోని వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గి రైతులకు ప్రయోజనం కలగనుంది. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### కాలిపోయిన విద్యుత్ పరికరం.. ఎండుతున్న పంటలు పునరుద్ధరణకు రైతుల నిరసన

**గంభీరావుపేట, అక్టోబర్ 08 జనం సాక్షి:**

గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ శివారులో మూడు రోజుల క్రితం కాలిపోయిన విద్యుత్ మార్పిడి పరికరం (ట్రాన్స్‌ఫార్మర్)ను ఇప్పటివరకు మార్చకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పాడైన విద్యుత్ పరికరం వద్ద రైతులు నిరసన చేపట్టి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.పంటలకు సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదా అని ప్రశ్నించారు. వెంటనే కొత్త విద్యుత్ మార్పిడి పరికరాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి పంటలను కాపాడాలని రైతులు అధికారులను వేడుకున్నారు.






# ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

## పిసిపిఎన్డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## బోధన్ ఆర్డీవో విజయ కుమారి

**బోధన్, అక్టోబర్ 8 ( జనంసాక్షి ) :**

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని పిసిపిఎన్డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని బోధన్ ఆర్డిఓ విజయకుమారి పిలుపునిచ్చారు. ఆడపిల్లల ప్రాధాన్యతను తెలియజేస్తూ, భ్రూణ లింగ నిర్ధారణను అరికట్టడం, పిసిపిఎన్డిటి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా బోధన్ పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆడపిల్ల పుట్టడం కుటుంబానికి, సమాజానికి మరియు దేశానికి ఒక వరమని పేర్కొన్నారు. భ్రూణ లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, లింగ వివక్షను పూర్తిగా నిర్మూలించి సమతుల్య లింగ నిష్పత్తి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల్లో పిసిపిఎన్డిటి చట్ట నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు మరియు జైలు శిక్షలు విధించబడతాయని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది , పిసిపిఎన్డిటి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి, భ్రూణ లింగ నిర్ధారణను అరికట్టడానికి మరియు ఆడపిల్లల సంరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విజయ కుమారితో పాటు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, బోధన్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విద్య, వైద్యులు డాక్టర్ సమత, జవేరియా సుల్తానా, బోధన్ ఇన్చార్జి సిడిపిఓ నందిని, పద్మాసింగ్, పిసిపిఎన్డిటి అధికారులు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## కోలమద్ది గ్రామంలో నూతన నిఘా కెమెరాల ఏర్పాటు



**గంభీరావుపేట, అక్టోబర్ 08 జనంసాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కోలమద్ది గ్రామంలో కేటీఆర్ సహకారంతో నూతన నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ఏడబోయిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నాగపురి బాలరాజు గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు నిఘా కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలో భద్రతను పెంపొందించడంతో పాటు ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నిఘా కెమెరాల ఏర్పాటు గ్రామ ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాత్రబోయిన లక్ష్మణ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దయాకర్‌రావు, సురేందర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, మహేందర్‌గౌడ్, నరేష్, నర్సింలు, సురేష్, వార్డు సభ్యులు దేవగౌడ్, కిషన్, దేవయ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

### మొగిలిపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా తోకల రాజు ఉపాధ్యక్షుడిగా గాడ్డం శ్రీనివాస్, కార్యదర్శిగా బొల్లి నసయ్య ఎన్నిక



**మల్లాపూర్ అక్టోబర్08 (జనంసాక్షి)** మత్స్య శాఖ పరిధిలోని మొగిలిపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ఎన్నికలు సంఘ భవనంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా తోకల రాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ అనూష ప్రకటించారు.సంఘ ఉపాధ్యక్షుడిగా గాడ్డం శ్రీనివాస్, కార్యదర్శిగా బొల్లి నసయ్య ఎన్నికయ్యారు. సంఘ పాలక మండలి సభ్యులుగా గాడ్డం పెద్ద రమేష్, తోకల శివయ్య, దుబోక్ గందే, దుబాక రమేష్, బొల్లి చంద్రరేఖ, బొల్లి మాణిక్యం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.ఎలాంటి అంచనాయ ఘటనలు జరుగకుండా పోలీస్ వారి బందా బస్తు నడుమ ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని వివరించారు.



## టీబీ ముక్త్ పంచాయతీగా రత్నాపూర్, హుస్సేన్‌నగర్

### హుస్సేన్‌నగర్‌కు గోల్డ్, రత్నాపూర్‌కు బ్రాంజ్ అవార్డులు.

**మల్లాపూర్, అక్టోబర్ 8: (జనంసాక్షి)**

క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా నిర్వహిస్తున్న "టీబీ ముక్త్ పంచాయతీ" కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ మండలానికి చెందిన హుస్సేన్‌నగర్, రత్నాపూర్ గ్రామాలు క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాయి.జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో హుస్సేన్‌నగర్ గ్రామపంచాయతీకి గోల్డ్, రత్నాపూర్ గ్రామపంచాయతీకి బ్రాంజ్ కేటగిరీ గుర్తింపులు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు మల్లాపూర్ వైద్యాధికారి డాక్టర్ వాహినికి ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం, అనుమానిత కేసులను గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, చికిత్స అందించడం వంటి చర్యలను సమర్థవంతంగా చేపట్టినందుకు ఈ గుర్తింపులు లభించాయి.ఈ కార్యక్రమంలో డి ఎంహెచ్ఓ డాక్టర్ సుజాత , డి వై డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్ , , డి వై డి ఎం హెచ్ ఓడాక్టర్ జైపాల్ రెడ్డి రత్నాపూర్ సర్పంచ్ గొండ రాజేందర్, హుస్సేన్ నగర్ సర్పంచ్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.మల్లాపూర్ మండలంలోని గ్రామాలకు టీబీ ముక్త్ పంచాయతీ గుర్తింపులు రావడం పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.




## వివేకానంద కళాశాలలో ఘనంగా ఆధ్వయ 2026 ఫ్రెషర్స్ డే

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 08, ( జనం సాక్షి)**

కరీంనగర్: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన 'ఆధ్వయ 2026' ఫ్రెషర్స్ డే వేడుకలు రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి,నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు ఎన్ఎస్ఎస్,ఎన్‌సీసీ,క్రీడా రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు.2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.డ్రగ్స్,మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో జీవించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శాతవాహన విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్,కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఎన్.వి.శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కళాశాలలో అందుబాటులో ఉన్న అధ్యాపకుల బోధన ,గ్రంథాలయం,ప్రయోగశాల వంటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా జూనియర్, సీనియర్ విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నృత్యాలు,ఇతర కళా ప్రదర్శనలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.నూతన విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్,ఏసీఓబీ సంపత్ కుమార్,ఏవోబీ బి.శ్రావణ్ కుమార్,కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్.గోపి కృష్ణ,డాక్టర్ ఎం.ఎ. సలీం,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డి. సాగర్,బి. మహేష్,ఎన్. శ్రీనివాస్, అధ్యాపకులు,భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# దొంగ హామీలతో రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- చిగురుమామిడిలో బీఆర్ఎస్ నాయకుల మెరుపు ధర్నా
- రైతులకు 24గంటల కరెంట్ కాదు కదా.. 5గంటలు కూడా ఇవ్వని ప్రభుత్వం..
- ధర్నాలో మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య



**చిగురుమామిడి అక్టోబర్ 08(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో గద్దెనెక్కి,అధికారంలోకి వచ్చాక రైతులను ఘోరంగా వంచించిందని భారత రాష్ట్ర సమితి నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వంపై నిరసనగా భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ ఎంపీపీ బేతి రాజీరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు 24గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తామని మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.కానీ నేడు 24గంటల కరెంట్ మాట దేవుడెరుగు, కనీసం ఐదు గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ అందించడం లేదని మండిపడ్డారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతులు మళ్లీ లైన్లలో నిలబడే పరిస్థితి వస్తుందని నాడు కేసీఆర్ గారు ముందే హెచ్చరించారని,నేడు అదే నిజమైందని అన్నారు.ప్రస్తుతం రైతులు డిఎపి,యూరియా సహా అన్ని రకాల ఎరువుల కొరకు క్యూ లైన్లలో గంటల తరబడి నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గంట కూడా కరెంట్ ఆపకుండా రైతులకు అండగా నిలిచామని గుర్తు చేశారు.ప్రస్తుత గవర్నమెంటు మాత్రం ఎల్ నినో ప్రభావం ఉందని ముందే తెలిసినప్పటికీ,కరెంట్ ఉత్పత్తికి సరైన నిల్వలు సమకూర్చకుండా రైతుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు.రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి,ఉపాధ్యక్షులు పెసర రాజేశం, సన్నిల్ల వెంకటేశం,మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మాజీఎంపీటీసీ కత్తుల రమేష్,మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్వర్ పాష,మాజీమండలాధ్యక్షుడు రామోజీ కృష్ణమాచారి,ఉపసర్పంచ్ గీట్ల తిరుపతిరెడ్డి,వార్డ్



మెంబర్స్ యాళ్ల జనార్దన్ రెడ్డి,ముసుకుల కృష్ణారెడ్డి,మేకల బొందయ్య, మూసాపూర్ శీను,గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర తిరుపతి,నాగేల్లి రాజిరెడ్డి,శ్యామాకుర సంపత్ రెడ్డి,కాశబోయిన రాజు,పరిపాటి రవీందర్ రెడ్డి,మహంకాళి కొమురయ్య,ముసుకుల సుధాకర్ రెడ్డి,దోనపాటి కృష్ణారెడ్డి,మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్ రెడ్డి,సాగర్ రెడ్డి, సందబోయిన వెంకన్న,పెసర మొగిలి,ఆకుల శ్రీనివాస్,యూత్ నాయకులు తాటికొండ సందీప్ రెడ్డి, రమేష్,నిలిగొండ దశరథం,శ్రీనివాస్ మరియు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ టి ఓ అధికారిగా సైబర్ మోసం

## వేములవాడలో వ్యక్తి అరెస్ట్



**వేములవాడ రూరల్, అక్టోబర్ 8 (జనంసాక్షి):** ఆర్ టి ఓ అధికారి పేరుతో ఫోన్ చేసి డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ నెపంతో మోసానికి పాల్పడిన నీరటి తిరుమల్ అనే వ్యక్తిని గురువారం వేములవాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామీణ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారంహన్మాజిపేటకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి ఫోన్ చేసి, గొంతు మార్చి ఆర్టీవో అధికారిగా నమ్మించి ఫోన్ పే ద్వారా రూ. 4,200 కాజేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి ఒక మొబైల్, రెండు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఆర్టీవో కన్సల్టెన్సీలో పనిచేసిన అనుభవంతో ఇతడు పలువురిని మోసం చేసినట్లు తెలిపారు. అధికారుల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్ నమ్మి డబ్బులు పంపవద్దని, సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

## హనుమాజీపేటలో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ క్యాంప్



**వేములవాడ రూరల్, అక్టోబర్ 8 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'టీబీ ముక్త్ భారత్' అభియాన్ లో భాగంగా హనుమాజీపేట గ్రామపంచాయతీ ఆవరణలో స్థానిక సర్పంచ్ అధ్యక్షతన ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ క్యాంప్ గురువారం నిర్వహించారు.ఈ శిబిరంలో హనుమాజీపేటతో పాటు బొల్లారం, లింగంపల్లి, మల్లారం, జయవరం గ్రామాల నుంచి వచ్చిన 74 మందికి ఉచితంగా ఎక్స్-రే పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ... క్షయ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు రాజయ్య, గంగమరాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# టీబీ రహిత గ్రామంగా కాచాపూర్

## ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమష్టి కృషితో సాధించిన ఘనత



**శంకరపట్నం, జనం సాక్షి అక్టోబర్ 8** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామం టీబీ (క్షయ) రహిత గ్రామంగా ఎంపికై మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. గ్రామంలో క్షయవ్యాధి నియంత్రణ, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలు చేయించడం వంటి చర్యలతో పాటు గ్రామ ప్రజల సహకారం కారణంగా ఈ గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ చేతుల మీదుగా కాచాపూర్ గ్రామ సర్పంచ్ ఊకంటి మాధవి టీబీ రహిత గ్రామ ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. గ్రామానికి లభించిన ఈ గుర్తింపు పట్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆరోగ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఊకంటి మాధవి మాట్లాడుతూ.. గ్రామాన్ని టీబీ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రజల ఆరోగ్య అవగాహన, సామాజిక బాధ్యత, సమిష్టి భాగస్వామ్యం ఎంతో కీలకంగా నిలిచాయన్నారు. గ్రామంలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం కూడా ఈ గుర్తింపు సాధించడంలో ముఖ్యపాత్ర పోషించిందన్నారు.టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామస్థులు సహకరించడం, ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమాలు, ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించడం వంటి చర్యలు గ్రామానికి ఈ గుర్తింపు దక్కేందుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ గ్రామాన్ని టీబీ రహితంగా కొనసాగించేందుకు అవసరమైన అన్ని చర్యలకు గ్రామ పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు.కాచాపూర్ గ్రామానికి ఈ గౌరవం దక్కడంపై సర్పంచ్ మాధవి గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, వైద్య సిబ్బందికి, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని ఆరోగ్యపరంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలందరూ ఇదే స్ఫూర్తితో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ రాఘవేంద్రరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



**కమాన్‌పూర్, అక్టోబర్ 08, (జనంసాక్షి) :** రానున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రొడ్డం వద్ద నిమజ్జన ఏర్పాట్లను చేపట్టారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ గురువారం జేసీబీ సహాయంతో రహదారికి, నిమజ్జన ప్రాంతానికి అడ్డుగా ఉన్న చెట్ల పొదలను తొలగించారు.బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన సమయంలో మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహ్మద్ రఫిక్ సోహెల్, వార్డు సభ్యులు మిట్ట సందీప్, పచ్చునూరి రాజ్‌కుమార్, మెరుగు కుమార్, పంజా సాయిరాం, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మంథని మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పర్షవేన మోహన్ యాదవ్



**మంథని, అక్టోబర్ 08, ( జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పర్షవేన మోహన్ యాదవ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మంథని పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హ్వాల్ లో నిర్వహించిన మండల యాదవ సంఘం సమావేశంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంజన సందనవేన రాజేందర్ యాదవ్, జిల్లా నాయకులు తొట్ల తిరుపతి యాదవ్, పర్షవేన బకన్నయ్య యాదవ్, ఉడుత పర్వతాలు యాదవ్ తదితరులు మోహన్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. యాదవ సంఘం బలోపేతానికి, సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. రెండోసారి తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులు, సభ్యులకు మోహన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. మంథని మండలంలో యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని మోహన్ యాదవ్ ఈ సందర్భంగా తెలియజేశారు.

# రోడ్డును కప్పేస్తున్న ముళ్ళ పొదల తొలగింపు

**కమాన్‌పూర్, అక్టోబర్ 08, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్ధిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని సిద్ధిపల్లె కు వెళ్లే ప్రధాన దారిలో స్ట్రీట్ లైట్ల వెలుతురుకు అడ్డుగా, రోడ్డును కప్పేస్తూ ఉన్న ముళ్లపొదలను, చెట్లను గురువారం గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ ఆధ్వర్యంలో తొలగించారు. చెట్ల కొమ్మలు, పొదల కారణంగా రహదారిపై వెలుతురు సరిగా పడక పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రాత్రివేళల్లో స్ట్రీట్ లైట్ల వెలుతురు రహదారిపై స్పష్టంగా పడే అవకాశం ఏర్పడింది. ప్రమాదాల నివారణతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సర్పంచ్ స్పందించి చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ - మండల పరిషత్ కార్యాలయం ముందు సిపిఐ నాయకుల ధర్నా**

**గన్నేరువరం, అక్టోబర్ 08 (జనంసాక్షి):**
గన్నేరువరం మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు గురువారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మండల వ్యాప్తంగా అర్హులను గుర్తించి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకపక్క కట్టిన ఇళ్లు కూలిపోతున్నాయని ,కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ వాడి లక్షలాది ప్రజాధనాన్ని వృధా చేశారని మండిపడ్డారు. అయినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికార పార్టీ నేతలు తమకు కావాల్సిన వారికి ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల అంజిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, గుండ్లపల్లి గ్రామ కార్యదర్శి బోయిని తిరుపతి, గన్నేరువరం గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, మాదాపూర్ గ్రామ కార్యదర్శి గాజుల లక్ష్మణ్, కొండాపూర్ కార్యదర్శి ఆంజనేయులు, మండల నాయకులు ఎండి, యువజన నాయకులు మోలుగురి ఆంజనేయులు, నయ్యుం, బిట్ల శ్రీనివాస్, సంపత్, శంకర్, చామనపల్లి శంకర్, సంపత్ కొమురయ్య, జలపతి, సంబు తిరుపతి, పంబాల ఆంజనేయులు,బుట్ల భాస్కర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాదాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో సిపిఐ పార్టీలో చేరారు.



## కరీంనగర్ లయన్స్ క్లబ్ ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని జరుపుకుంది

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 8 ( జనంసాక్షి )**
సమాజంలోని నిరుపేద, అణగారిన వర్గాలకు నాణ్యమైన కంటి సంరక్షణ సేవలను అందించాలనే తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, కరీంనగర్ లయన్స్ క్లబ్ వారు రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాదేకర్ ఛారిటబుల్ కంటి ఆసుపత్రిలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మైదం శివకాంత్ పటేల్, కార్యదర్శి బట్టు వినోద్ పటేల్, కోశాధికారి మేతుకు కె చైతన్య పాల్గొన్నారు. కంటి ఆసుపత్రి ఛైర్మన్ ప్రకాష్ హోల్లా, ట్రస్టీ కోల అన్నారెడ్డి కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది చింతల ప్రభాకర్, రాజు పాల్గొని, నివారించదగిన దృష్టి నష్టాన్ని అరికట్టడానికి క్రమం తప్పని కంటి పరీక్షలు, కంటి వ్యాధులను ముందుగానే గుర్తించడం మరియు సకాలంలో చికిత్స తీసుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ భాస్కర్ మాదేకర్ ఛారిటబుల్ కంటి ఆసుపత్రి, కరీంనగర్ లయన్స్ క్లబ్ యొక్క ఒక శాశ్వత ప్రాజెక్ట్. ఇది ఏడాది పొడవునా నిరుపేద ప్రజలకు సేవ చేయడానికి అంకితమై ఉంది. ఈ ఆసుపత్రి, సమాజంలోని అర్హులైన సభ్యులకు కంటి పరీక్షలు మరియు చికిత్సతో సహా ఉచిత కంటి సంరక్షణ



సేవలను అందిస్తుంది. క్లబ్ సభ్యులు వైద్యులు ఆసుపత్రి సిబ్బంది యొక్క అంకితభావంతో కూడిన సేవలను ప్రశంసించారు, కంటి సంరక్షణ సేవలను బలోపేతం చేయడానికి, ప్రజలలో కంటి



ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ప్రపంచ దృష్టి దినోత్సవ కార్యక్రమం, కరీంనగర్ లయన్స్ క్లబ్ యొక్క “మేము సేవిస్తాము అనే నినాదానికి నిరంతర నిబద్ధతను మరియు సమాజంలోని ప్రతి వర్గానికి నాణ్యమైన కంటి సంరక్షణను అందించాలనే దాని లక్ష్యాన్ని ప్రతిబింబించింది.

## వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి

కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 08, ( జనం సాక్షి)
కరీంనగర్: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హౌసింగ్ బోర్డు కాలనీలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్ల సర్వసభ్య సమావేశం అధ్యక్షులు శ్రీ చందా సుధాకర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా 7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని ఉజయ్ గారు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా డేకేర్ సెంటర్ కార్యదర్శి శ్రీ పెండ్యాల కేశవరెడ్డి,గణేష్ నగర్ సీనియర్ సిటిజన్ల ప్రతినిధి శ్రీ బండి సత్తయ్య,బోర్డు కాలనీ బాధ్యులు శ్రీ మెతుకు కిషన్ బాలకిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులైన సీనియర్ సిటిజన్లను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి,మెమెంటోలు అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సీనియర్ సిటిజన్ కార్యాలయ విస్తరణ,వృద్ధులకు అందాల్సిన సంక్షేమ పథకాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యదర్శి శ్రీ పాలెపు సుధాకర్ వార్షిక నివేదికను సమర్పించగా,కోశాధికారి శ్రీ అంబటి రవీందర్ రాము 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ–వ్యయ వివరాలను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ కార్యవర్గ సభ్యులు శ్రీ వీరేశం,శ్రీ కోడ్ రాంరెడ్డి,శ్రీ ఇ. భాస్కర్ రెడ్డి,శ్రీ నలువాల రాజేందర్,శ్రీ మార్పి రాద్రి లక్ష్మీనారాయణ,శ్రీ కూన్నా రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఏడు సంవత్సరాలకు ఇంటికి చేరిన మహేందర్ శారద ఫౌండేషన్ సహకారంతో

**వీణవంక అక్టోబర్ 8 (జనంసాక్షి)**
వీణవంక మండలంలోని ఘన్ముకుల గ్రామానికి చెందిన బొంగోని మహేందర్ మతిస్థిమితం లేక ఇంటి నుండి సుమారు ఏడు సంవత్సరాల క్రితం వెళ్లిపోయాడు. వెళ్లిపోయినప్పుడు నుండి కుటుంబ సభ్యులు చుట్టుపక్క గ్రామాలలో పలుచోట్ల బంధువుల ఇండ్లలో వెతికిన మహేందర్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు,తన సొంత గ్రామానికి మహేందర్ గురువారం ఉదయం మహారాష్ట్ర నుంచి మహేందర్ తన ఇంటికి వచ్చిన సమాచారం తెలుసుకొని కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గత ఏడేళ్లుగా మతిస్థిమితం లేని మహేందర్ కు శారద ఫౌండేషన్ ప్రతినిధులు ఆశ్రయం కల్పిస్తూ,అతని కోలుకోవడానికి అవసరమైన చికిత్స సంరక్షణ అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శారద ఫౌండేషన్ సేవలతో మహేందర్ కోలుకొని సాధారణ స్థితికి రావడంతో కుటుంబ సభ్యులు ఆనంద భాష్పాలతో లోనయ్యారు. అతన్ని కుటుంబానికి తిరిగి చేర్చడంలో సేవలందించిన శారద ఫౌండేషన్ ప్రతినిధులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సభ్యులు,గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులను ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు.

## గూడు కరువై చెదిరిన గుండె

**విధి విసిరిన పంజాకు నేతన్న కుటుంబంలో విషాదం**



**ముస్తాబాద్ అక్టోబర్ 08 జనం సాక్షి**
ఆ పేద కుటుంబంలో. సర్కారు బడిలో చదువుతున్న కూతురు, బీడీ కంపెనీలో శ్రమిస్తున్న భర్త, బీడీ కార్మికురాలిగా పనిచేస్తున్న భార్య. 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవితం. నెరవేరని సొంత ఇంటి కల. సంవత్సరాలుగా పాలకులకు మొర. ఎదురుచూస్తూ అలసిపోయిన ఆ గుండె అకస్మాత్తుగా ఆగిపోయింది. కన్ను మూసిన ఆ మాతృమూర్తి మృతదేహం, అద్దె ఇంటి వారి ఔదార్యం తో ఆ ఇంటి ముందు కడసారి చూపు కోసం ఉంది .ఇది ఒక సుధామయ విగత జీవి కథ. మండల కేంద్రమైన ముస్తాబాద్ లో బుధవారం రాత్రి జరిగిన వేదనా భరిత ఘటన ఇది. ముస్తాబాద్ లోని ఒక బీడీ కంపెనీ ఆఫీసులో న్యాలపల్లి రాజు కార్మికునిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య సుధ, సర్కార్ బడిలో 9వ తరగతి చదువుతున్న కూతురు బిందియా ఉన్నారు. చేనేత కుటుంబానికి చెందిన రాజు బతుకు తెరువు కోసం ముస్తాబాద్ కు 20 ఏళ్ల క్రితమే వచ్చి ఇక్కడ బీడీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇక్కడ ఇక్కడే స్థిర నివాసం ఉంటున్న రాజుకు సొంత ఇల్లు లేకపోగా గత దశాబ్ద కాలానికి పైగా తన సతీమణి సుధ పేరిట డబుల్ బెడ్ రూమ్ కోసం ఇప్పటికీ అనేకసార్లు దరఖాస్తులు ఇచ్చాడు. కానీ ఆ కల ఇప్పటికీ నెరవేరలేదు. కార్మిక జీవితాలు గడుపుతున్న తాము స్థలం కొనుగోలు చేసే స్తోమత లేకపోగా, ఒక్కగానొక్క కుమార్తెను స్థానిక ప్రభుత్వ బడిలో 9వ తరగతి చదివిస్తున్నారు. ఇలా వారి జీవితం సాగుతుండగా సుధ కు గత రెండు, మూడు రోజులుగా జ్వరం రావడం, బుధవారం రాత్రి ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురవడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి సిద్దిపేట తర్వాత హైదరాబాద్ కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో గుండెపోటుతో కన్నుమూసింది. దీనితో ఆ చిన్ని కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉండడానికి ఒక గూడు కావాలని ఎప్పుడూ కలవరిస్తూ, డబుల్ బెడ్ రూమ్ కోసం ఎన్నో ఏళ్లుగా తమ బంధువులతో ఎప్పుడు గుర్తు చేస్తూ తపన పడిన సుధ ఆ కల నెరవేరకుండానే కూతురుకు తల్లి లేని దుఃఖాన్ని, భర్తను తీవ్ర ఆవేదనకు,బంధు వర్గాలను శోక సంద్రంలో నింపుతూ కన్ను మూసింది. నిలువ నీడ లేకుండా ఉన్న ఆ కుటుంబాన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థుల స్వాగత వేడుక

**గంభీరావుపేట, అక్టోబర్ 08 జనం సాక్షి:**
గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అధ్యక్షతన సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో నూతన విద్యార్థుల స్వాగత వేడుకను ఘనంగా నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఉదయం నుంచి విద్యార్థులు వివిధ ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్య క్రమాలతో సందడి చేశారు. నైపుణ్యాభివృద్ధి, సమాచార ప్రసార నైపుణ్యాలపై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ఈ సందర్భంగా ధ్రువపత్రా లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసు కున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి, భవిష్యత్తు లో మంచి ఉద్యోగాల్లో




స్థిరపడాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించిన నిర్వాహ కులను అభినందించారు. కంప్యూటర్ శాస్త్ర విభాగ అధ్యాపకుడు శంకర్, జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.వి. భిక్షమయ్య తమ ఆటపాటలతో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రభాకర్, అంతర్గత నాణ్యత హామీ విభాగం సమన్వయకర్త డాక్టర్ వై. ఆంజనేయులు, జాతీయ సేవా పథకం అధికారి పాక ధర్మపురి, మహిళా సాధికారత సమన్వయకర్త వి. వాణి, టాస్క్ సమన్వయకర్త శ్రావణ్ కుమార్, డాక్టర్ ఆది విష్ణు, డాక్టర్ కె.వి. భిక్షమయ్య, మనోహర్, సుచరణ్, శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, మహేష్, శంకర్, దీపిక, భార్గవి, అఖిల్య, విజయతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు

## ముస్తాబాద్ లో నార్కోటిక్ డాగ్ తో ఆకస్మితక తనిఖీలు

**ముస్తాబాద్ అక్టోబర్ 08 (జనం సాక్షి)**
మాదక ద్రవ్యాల నియంత్రంలో భాగంగా ముస్తాబాద్ పట్టణంలోని పలు షాపులు వాణిజ్య సంస్థలు పోలీసులు నిర్కోటిక్ డాగ్ సాయంతో ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. హనుమాన్ స్పందన వస్తువులు, మాదక ద్రవ్యాల నిల్వ లేదా విక్రయాలపై ప్రత్యేక దృష్టి సాధించి తనిఖీలు చేపట్టారు. ప్రజల్లో



అవగాహన కల్పిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం విక్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీలు స్థానికంగా చర్చనీయంగా మారాయి ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గాని సిబ్బంది, పాల్గొన్నారు



## ధర్మపురి భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం

**ధర్మపురి జగిత్యాల జిల్లా అక్టోబర్06(జనంసాక్షి):**

భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ఈ రోజు పట్టణ కార్యకర్తల సమావేశం వాసవి ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది.. ఈ కార్యకర్తల సమావేశంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ మాట్లాడుతూ.. సేవాసంకల్పప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రేపు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది,

అలాగే. ఎల్లుండి 7/10/26 బుధవారం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్ర మోడీ పుట్టినరోజు పురస్కరించుకొని నెలరోజుల కార్యక్రమంలో భాగంగా సేవా జ్యోతి ర్యాలీ జగిత్యాల జిల్లా కేంద్రంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. అలాగే.. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ సూచన మేరకు రక్తదాన శిబిరాన్ని 8/10/26 గురువారం రోజున బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది.. కాబట్టి నియోజకవర్గ స్థాయిలోని కార్యకర్తలు, నాయకులు, అందరూ కూడా ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయగలరని కోరుతున్నాం.ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు మండలోజు సురజ్, జిల్లా ఎండోమెంట్ కో కన్వీనర్ కలకోట రాజు, పట్టణ కన్వీనర్ కొత్తపల్లి కిషన్, పట్టణ కార్యదర్శి ఠాగూర్ రాకేష్, అప్పం శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు మామిడిపల్లి రంజిత్ , కాసారపు వెంకటేష్, సోషల్ మీడియా ఇన్చార్జి కాసెట్టి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## టేస్కాబ్ ఛైర్మన్ రేసులో కేకే



ముస్తాబాద్ అక్టోబర్ 08 (జనం సాక్షి)

ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేకే మహేందర్ రెడ్డికి ఎట్టకేలకు టేస్కాబ్ ఛైర్మన్ పదవి వరించనుందని ప్రచారం జోరుగా సాగుతుంది,కాంగ్రెస్ పార్టీలో పలుమార్లు సిరిసిల్ల ఎమ్మెల్యేగా పోటీ చేసి మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ చేతుల్లో పరాజయం పొందిన కేకే మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉండి క్రియాశీల రాజకీయాల్లో రాణిస్తూనే ఉంటూ ఢిల్లీ అధిష్టానం పెద్దల ఆశీస్సులు పొంది ఇట్టి పదవి దక్కించుకున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే కేకే మహేందర్ రెడ్డికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీ అధిష్టానం పెద్దలకు కేంద్ర , రాష్ట్ర ఇంటలిజెన్స్ వర్గాలు సమాచారం అందించినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయంలో టేస్కాబ్ ఛైర్మన్గా పనిచేసిన గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామానికి చెందిన కొండూరి రవీందర్ రావు ఇట్టి పదవిలో సుదీర్ఘకాలంగా పనిచేశారు. ఇటీవల రవీందర్ రావు అట్టి పదవి నుండి వైదొలిగారు. ఇటీవల సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కేకే మహేందర్రెడ్డి అనుచరవర్గం మొత్తం వందల సంఖ్యలో గాంధీ భవన్కు వెళ్లి మహేందర్ రెడ్డికి ప్రోటోకాల్ పదవి ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్కు విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్లకు వచ్చి బహిరంగ సభ నిర్వహిస్తున్న సమయానికంటే ముందే కేకే మహేందర్ రెడ్డికి కేబినెట్ స్థాయి పదవి వస్తుందని ఆశించిన చివరకు నిరాశే ఎదురయింది.కానీ సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ అనంతరం కేకే మహేందర్ రెడ్డి కి అదృష్టం కలిసి వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. దసరా పండగ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డికి ఇట్టి పదవికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నట్లు కేకే అనుచరులు తెలిపారు.కేకే అనుచరుల్లో వెలివేరుస్తున్న ఆనందంసిరిసిల్ల నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి కేటీఆర్ స్థానంలో స్థానికంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే సుదిరే కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కేకే మహేందర్ రెడ్డి కి కీలక పదవి అప్పగిస్తే ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని భావించి ఢిల్లీ పెద్దల ఆశీర్వాదంతో కేకేకు పదవి కట్టబెట్టనున్నారు. గతంలో కూడా ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తికే టేస్కాబ్ ఛైర్మన్ పదవి బాధ్యతలు ఇవ్వగా బిఆర్ఎస్ పార్టీ బలోపేతం అయింది. ఈ పరిణామాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పాగా వేయాలంటే కీలకమైన పదవులతోనే సాధ్యమని భావిస్తున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దసరాలోపు కేకేకు కీలక బాధ్యతలు అప్పగించనుంది

# అడెలి పోచమ్మ దేవాలయం ను సందర్శించిన మైతాపూర్ గ్రామస్తులు

**రాయికల్ అక్టోబర్ జనంసాక్షి:**

నిర్మల్ జిల్లాలో ని సారంగాపూర్ మండలంలోని అడెలి మహపోచమ్మ తల్లి జాతర సందర్భంగా జగిత్యాల జిల్లాలో ని రాయికల్ మండలంలోని మహితాపూర్ గ్రామ నాయకులు జంటలతో కలిసి కుటుంబ సభ్యుల తో కలిసి గురువారం రోజున దరిసించుకోని మొక్కులు చెల్లించారు. అడవి ప్రాంతంలో గల ఈ క్షేత్రంలో వెలిసిన అమ్మవారి భక్తుల పాలిట కొంగు బంగారం గా విరజిలుతోంది. తిథి ముహూర్తం లతో సంబంధం లేకుండా దసర దేవి శరనవ రాత్రి సందర్భంగా శనివారం రోజున జాతర ప్రారంభం చేసి ఆదివారం రోజున ముగుస్తుంది. అమ్మవారి ఆభరణాలను పవిత్రమైన గోదావరి నది లో శుభ్రం చేసే ఈ జాతర కార్యక్రమం రెండు రోజుల పాటు సాగుతుంది.ఈ నేపధ్యంలో అడెలి మహ పోచమ్మ ఆలయం నుండి అమ్మవారి ఆ భరణాలు తో బయలుదేరి ఆదివారం ఉదయం బయలుదేరి న్యూ సాంగ్లి గ్రామంలో గోదావరి లో అమ్మవారి నగలను శుభ్రం చేసుకుని దిలావర్ పూర్ గ్రామంలో ప్రవేశం చేసి వారిని చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన ప్రజలు తండోపతండాలు గా రోడ్లకు ఇరువైపులా బారు లుతీరి అమ్మ వారి ఆభరణాలకు స్వాగతం పలుకుతారు. ఈ జాతర సందర్భంగా



అమ్మవారి ఆభరణాలను దేవాలయం అర్చకులు వెంట రాగా ఇరువది కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి జలాల తో అమ్మవారి ఆభరణాలను నగలను శుభ్రం చేసి తిరిగి దేవాలయం నకు ప్రయాణం అవుతారని చెప్పారు..ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాష్ట్ర నాయకులు గంప ఆనందం మంజుల మహితాపూర్ గ్రామ పంచాయతీ? వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య మల్లమ్మ అనుమల్ల రమ సత్యనారాయణ పాలడుగు లింగారెడ్డి శారద కొల్ల కృష్ణ రెడ్డి విజయ గన్నే సుధాకర్ స్వప్న పాలడుగు అనిల్ జ్యోతి పాలడుగు గంగారెడ్డి లక్ష్మీ కొయ్యడి జగపతి పద్మ దుంపల స్వామి రెడ్డి రజిత కర్నే గంగారెడ్డి లక్ష్మీ కలిసి నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మి ఆలయం రాజా శ్యామల పిఠాం గండి రామన్న ఆలయం సాయిబాబా శివాలయం నంది దుర్గ ఆలయ లు దర్శించుకుని అక్కడి నుండి నేరుగా అడెలి పోచమ్మ దేవాలయం నకు వెళ్లి అక్కడ అందరు దర్శనము చేసుకుని అనంతరం వంట చేసుకుని అందరూ కలిసి బోజనము చేసిన తరువాత అక్కడ అందరూ కలిసి ఆటలు ఆడి పాటలు పాడి ఆనంద మూగ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.. అందరూ ఈ యాత్ర ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. అక్కడి నుండి నేరుగా ఇంటికే వచ్చారు.



### ఆర్.జి-3, ఎపిఎ ఏరియాలో

## కార్పొరేట్ టార్గెట్ కమిటీ పర్యటన

**రామగిరి జనం సాక్షి (అక్టోబర్ 8):**

రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గురువారం కార్పొరేట్ టార్గెట్ కమిటీ పర్యటించింది. పర్యటనలో భాగంగా ×కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ విభాగం జనరల్ మేనేజర్, కమిటీ కన్వీనర్ జి.దేవేందర్, ఉపరితల గనుల విభాగం జనరల్ మేనేజర్ పి.ఎలీషా, భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఐ అండ్ పి ఎం విభాగం జనరల్ మేనేజర్ యం.వి.నరసింహరావు, ఐఈ విభాగం ఎజిఎం సిహెచ్.వెంకయ్య, రామగుండం రీజియన్ నాణ్యత విభాగం జనరల్ మేనేజర్ జె. వెంకట రమణ× లతో పాటు ఇతర కమిటీ సభ్యులు జీఎం కార్యాలయం నందు ×రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు× లతో పాటు ఏరియా లోని వివిధ గనుల, విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో 2027-28 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించాల్సిన లక్ష్యం, ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, రవాణా ఓ.బి (మట్టి వెలికితీత) మొదలగు అంశాల పైచర్చించారు.అదేవిధంగా 2027-28 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయా భూగర్భ, ఉపరితల గనులకు కావలసిన యంత్రాలు, యంత్ర సామాగ్రి, పనిముట్లు, సదుపాయాలు అంశాలపై చర్చించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయాలని, భద్రత తో ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎంలు ఎం.రామ్మోహన్, బండి సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్లు ఎ.ఉదయ భాస్కర్, దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్, కె.జనార్ధన్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జ్ఞాన సంబంధన్, ప్రకాష్, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్ కుమార్, కార్పొరేట్ కమిటీ సభ్యులు సిహెచ్. గాబ్రియల్ రాజు, రామక్రిష్ణ, గంగాధర్, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**చొప్పదండి, అక్టోబర్ 8 (జనం సాక్షి):**

చొప్పదండిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ుఉ 22 ు 2821 నెంబర్ గల ట్రాక్టర్ను ఎస్సై ఔ రాజ్ కుమార్ ఆధ్వర్యంలోపట్టుకున్నారు. గర్రెపల్లి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ట్రాక్టర్ను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిరుపేద వైద్యానికి రూ.2 లక్షల సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు..



**ఇల్లంతకుంట, అక్టోబర్ 8 (జనంసాక్షి):**

మండలంలోని వెల్జీపురం గ్రామానికి చెందిన కంకణాల లక్ష్మారెడ్డి అనారోగ్యానికి గురై వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామ కాంగ్రెస్ నాయకులు మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు.ఈ మేరకు ఎమ్మెల్యే సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. దీంతో బాధిత కుటుంబానికి వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా లభించింది.ఈ సందర్భంగా సహాయానికి కృషి చేసిన ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణకు సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, పాక్స్ డైరెక్టర్ గుండ వెంకన్న, ఉపసర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, బాధితుడు కంకణాల లక్ష్మారెడ్డితో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని వారు పేర్కొన్నారు.

## మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**గంగాధర అక్టోబర్ 08 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల మరియు కళాశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మహిళ ఉపాధ్యాయురాళ్లు మరియు విద్యార్థులు బతుకమ్మ పాటలతో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు పట్ల అవగాహన కలుగుతుందన్నారు విద్యార్థులంతా కలిసి మెలిసి ఉండేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వరుణ్ జ్యోతి, రమేష్, రాజు, మంగ, రాణి, ప్రసన్న, శ్వేత, హేమాశ్రీ ,రమ, సునీత, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

